ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అనకాపల్లి
జిల్లా వార్తలు

సోమవారం 6 అక్టోబరు 2025



దేవరాపల్లి వెళ్లే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

సందిగ్ధంలో సాగుదారులు

రాచపల్లి కొండపోరంబోకు భూములపై ఎటూ తేల్చని అధికారులు

- సర్వే చేసి సాగుదారుల గుర్తింపు
- మూడు నెలలుదాటినా ఏర్పాటు చేయని గ్రామసభ
- నష్టపరిహారంపై కొరవడిన స్పష్టత
- రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించాలని వినతి



సర్వే నంబరు 737లో రైతులు సాగు చేసుకుంటున్న కొంబపోరంబోకు భూములు

మాకవరపాలెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ కొండపోరంబోకు భూములను దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న రైతులకు న్యాయం చేస్తామని చెప్పిన రెవెన్యూ అధికారులు.. ఆయా భూములను సర్వే చేసి పరిహారం విషయంలో ఏటూ తెల్చకుండా వదిలేశారు. దీంతో ఆయా భూముల్లో సాగులో వున్న తోటల్లో నిర్వహణ పనులు చేపట్టడం, ఎరువులు వేయడంపై సాగుదారులు సందిగ్ధంలో పడ్డారు.

మాకరపాలెం మండలం రాచపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 737లో సుమారు 1,500 ఎకరాల ప్రభుత్వ కొండపోరంబోకు భూములు వున్నాయి. ఎరకన్నపాలెం, చినరాచపల్లి, జి.వెంకటాపురం, రామన్నపాలెం, వెంకయ్యపాలెం గ్రామాలకు చెందిన సన్న, చిన్నకారు రైతులు సుమారు ఏడు దశాబ్దాల నుంచి సుమారు 500 ఎకరాల్లో మామిడి, జీడిమామిడి తోటలు వేసుకుని, వచ్చే ఫలసాయంతో జీవనం సాగిస్తున్నారు. తమకు డి.పట్టాలు మంజూరు చేయాలని చాలా ఏళ్ల నుంచి అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో గత ఏడాది సాధారణ ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాచపల్లి రెవెన్యూ 737 సర్వే నంబరులో ఉన్న సుమారు 1,500 ఎకరాలను పరిశ్రమ ఏర్పాటుకే కేటాయించనున్నట్టు ప్రకటించారు. తరువాత అధికారులు సర్వే చేశారు. వివిధ గ్రామాలకు చెందిన 469 మంది రైతులు 406 ఎకరాలను సాగు చేసుకుంటున్నట్టు గుర్తించారు. ఈ మేరకు మూడు నెలల క్రితం జాబితాలను కూడా తయారు చేశారు. గ్రామ సభ నిర్వహించి, వాస్తవ సాగుదారులను గుర్తిస్తామని అధికారులు చెప్పారు. కానీ ఇంతవరకు గ్రామ సభ నిర్వహించలేదు. అదే విధంగా ఎకరాకు ఎంత నష్టపరిహారం ఇస్తారో వెల్లడించలేదు. మామిడి, జీడిమామిడి ... మిగతా 4వ పేజీలో

ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట

దసరా తిరుగు ప్రయాణాలతో రద్దీగా నడిచిన బస్సులు

- అనకాపల్లి డిపోకు రూ.2 కోట్లకుపైగా ఆదాయం



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):

దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుని, తిరిగి ఉద్యోగం, ఉపాధి చేస్తున్న ప్రదేశాలకు వెళ్లేవారు, బంధువుల ఇళ్లకు వచ్చి స్వగ్రామాలకు కుటుంబాలతో సహా వెళుతున్న వారితో ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిటలాడింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు రద్దీ కొనసాగింది. బస్సు ప్లాట్ ఫారం వద్దకు రావడమే తరువాయి.. లోపలికి ఎక్కడానికి ఎగబడ్డారు. సీట్ల కోసం హడావిడి చేశారు. కొంతమంది కిటికీల్లో నుంచి లగేజీని బస్సు సీట్లలో వేసి బస్సు ఎక్కారు. నర్సీపట్నం, పాయకరావుపేట, చోడవరం, మాడుగుల, దేవరాపల్లి, విశాఖపట్నం, గాజువాక, విజయనగరం ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ కిటకిటలాడాయి. చాలా మంది నిల్చొని ప్రయాణించాల్సి వచ్చింది.

దసరా ప్రయాణాల ఆదాయం రూ.2 కోట్లు

దసరా శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా అనకాపల్లి డిపోకు రూ.2 కోట్లకు పైగా ఆదాయం లభించిందని డీపీటీవో వి.ప్రవీణ తెలిపారు. అనకాపల్లి డిపో నుంచి శనివారం నడిపిన బస్సుల్లో సగటున ఓఆర్ 124 శాతం నమోదైందని చెప్పారు. దసరా పండగ ప్రారంభం నుంచి ఓఆర్ వంద శాతానికిపైగా వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకాన్ని అమలులోకి తెచ్చిన తరువాత ఓఆర్ శాతం బాగా పెరిగిందన్నారు. విజయవాడ వెళ్లే భవానీ మాలధారుల కోసం ప్రత్యేక బస్సులను నడిపినట్టు ఆమె తెలిపారు.

30 టన్నుల రేషన్ బియ్యం సీజ్



పట్టుకున్న రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

నాతవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):

విజిలెన్స్ అధికారులు ఆదివారం మండలంలో ని ఎ.శరభవరం వద్ద దాడులు నిర్వహించి 30 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. లారీలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో విజిలెన్స్ ఎస్‌ఐ రవి కుమార్ ఆధ్వర్యంలో లారీని ఆపి తనిఖీ చేశారు. మొత్తం 608 బస్తాల బియ్యాన్ని పట్టుకున్నారు. అనంతరం పౌరసరఫరా డీటీకి అప్పగించారు. బియ్యానికి సంబంధించి నూకా నరసింహంపై కేసు నమోదు చేశారు.

పక్కాగా ఆస్తి పన్ను వసూళ్లు

ఇంతవరకు పన్ను మదింపు చేయని నివాసాల గుర్తింపునకు సర్వే

- పాత భవనాలపై అదనపు నిర్మాణాలు సైతం..
- ఇప్పటి వరకు 8,200 ఇళ్ల సర్వే పూర్తి
- పన్ను చెల్లించని కొత్త ఇళ్లు 262, అదనపు నిర్మాణాలు చేసినవి 493
- ఇంకా సర్వే చేయాల్సిన ఇళ్లు 6,400



నర్సీపట్నం శారదా నగర్

నర్సీపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):

మునిసిపాలిటీలో ఆస్తి పన్ను మదింపు చేయని కొత్త ఇళ్లు, ఇప్పటికే వున్న భవనాలపై అదనపు నిర్మాణాలను గుర్తించడానికి అధికారులు నాలుగు నెలలుగా సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు 8,200 నివాసాలను సర్వే చేయగా, ఇంకా 6,400 ఇళ్లు సర్వే చేయాల్సి ఉంది. 262 కొత్త ఇళ్లు, 493 అదనపు నిర్మాణాలను గుర్తించారు.

మునిసిపాలిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు కాకుండా, ఇళ్ల పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే ప్రధాన ఆర్థిక వనరు. ఆస్తి పన్ను వసూళ్ల ద్వారా వచ్చిన ఆదాయంతోనే అభివృద్ధి పనులు జరుగుతాయి. ఆస్తి పన్ను వసూళ్లనుబట్టే ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు గ్రాంట్ మంజూరు చేస్తుంది. దీంతో మునిసిపాలిటీలో ప్రతి ఇంటి నుంచి ఆస్తి పన్ను వసూలుకు అధికారులు నడుం బిగించారు. ఇందుకోసం నాలుగు నెలల క్రితం ఇంటింటా సర్వే చేపట్టారు. ఇప్పటి వరకు 8,200 ఇళ్ల సర్వే పూర్తి చేశారు. ఇంకా 6,400 ఇళ్ల సర్వే చేయాల్సి ఉంది. ఆస్తి పన్ను చెల్లించని 262 కొత్త ఇళ్లను గుర్తించారు. అలాగే 493 అదనపు నిర్మాణాలు గుర్తించి ఆస్తి పన్ను విధించడానికి చర్యలు తీసుకుంటున్నారు. పక్కాగా దస్తావేజులు ఉన్న ఇంటికి సంబంధిత యజమాని పేరు మీద ఆస్తి పన్ను వేస్తున్నారు. ఇంటి దస్తావేజులు లేని వాటికి అసెస్‌మెంట్ నంబరు ఇచ్చి పేరు దగ్గర 'హోల్డ్ ఆఫ్ ది ప్రిమిసెస్' అని పేర్కొంటూ పన్ను వేస్తున్నారు. ఉదాహరణకు మూడు అంతస్థులకు ప్లాన్ తీసుకొని, ఆర్థిక వెసులుబాటునుబట్టి రెండు అంతస్థులు నిర్మించి,మూడో అంతస్థు శ్లాబ్ ఖాళీగా వుంచుతున్నారు. ఇటువంటి వారి నుంచి రెండు అంతస్థులకు మాత్రమే ఆస్తి పన్ను విధిస్తారు. భవన యజమాని డబ్బులు అందుబాటులో వున్నప్పుడు మూడో అంతస్థు పూర్తి చేస్తుంటారు. సర్వేలో ఇటువంటి వాటిని గుర్తించి ... మిగతా 4వ పేజీలో

బాబోయ్ కుక్కలు!

నానాటికీ అధికమవుతున్న గ్రామ సింహాల బెడద

- పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడి
- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- ప్రజలు భయాందోళన



సబ్బవరం మెయిన్ రోడ్డుపై గ్రామ సింహాల సంచారం

సబ్బవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని అన్ని గ్రామాల్లో వీధి కుక్కల సంతతి రోజు రోజుకీ పెరిగిపోతున్నది. దీంతో వీటి బెడద సైతం అధికం అవుతున్నది. ముఖ్యంగా ఏడాది కాలంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా గుంపులు గుంపులుగా తిరుగుతూ, ద్విచక్ర వాహనదారులు, పాదచారులపై దాడి చేస్తున్నారు. దీంతో చిన్న పిల్లలు, పాఠశాలల విద్యార్థులు, వృద్ధులు వీధుల్లోకి రావాలంటే భయపడుతున్నారు. పుస్తకాల బ్యాగులతో స్కూళ్లకు నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థుల వెంటపడి కరుస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. దీంతో పలువురు తల్లిదండ్రులు ఇంటికి సమీపంలో వున్న పాఠశాలకు సైతం ఆటోలో పంపడం, లేదంటే స్వయంగా విడిచిపెట్టి రావడం చేయాల్సి వస్తున్నది. ద్విచక్ర వాహనాల వెంట పరుగులు తీస్తూ, వాహన చోదకులకు భయాందోళనకు గురిచేస్తున్నాయి. కుక్కల దాడి నుంచి తప్పించుకోవడానికి వేగం పెంచి, ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక పశువుల కల్లాల వద్ద గుంపులుగా సంచరిస్తూ కోళ్లు, లేగ దూడలను చంపేసి ఎంచక్కా తినేస్తున్నాయి.



చినగొల్లలపాలెంలోని ఒక వీధిలో కుక్కలు

ఇటీవల అనకపల్లికి చెందిన స్టీల్ ప్లాంట్ ఉద్యోగి ద్విచక్ర వాహనంపై లంకెలపాలెం రోడ్డులో విధులకు వెళుతున్నారు. రోడ్డుపై ఒకచోట పెద్ద గొయ్యి ఉండడంతో వాహన వేగాన్ని తగ్గించారు. అంతే రెప్పపాటులో కుక్కల గుంపు వచ్చి దాడి చేసి, కాళ్లపై పలుచోట్ల కరిచాయి. ఇతను అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని, రెండు నెలల నుంచి విధులకు వెళ్లకుండా ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. సబ్బవరంలో స్కూల్ ఆటోపై దాడి చేసి ఒక విద్యార్థిని కరిచాయి. గుల్లేపల్లిలో ద్విచక్ర వాహన చోదకుడిపై ... మిగతా 4వ పేజీలో

భాషా పండిట్లకు పదోన్నతులు

క్లస్టర్ల పరిధిలోనే విధులు

- ప్రస్తుత పాఠశాలలోనే కొనసాగే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 78 మందికి ఉత్తర్వులు



విశాఖపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):

ఆరేళ్ల నిరీక్షణ అనంతరం తెలుగు/హిందీ భాషా పండిట్లకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు కొనసాగుతున్న భాషా పండితులకు కల్పించిన స్కూల్ అసిస్టెంట్ కేడర్ పదోన్నతులు ఈ నెల మూడోతేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 75 మంది తెలుగు, ముగ్గురు హిందీ భాషా పండితులకు ప్రయోజనం చేకూరింది.

ఉమ్మడి ఏపీలో నిర్వహించిన డీఎస్సీల ద్వారా నియమితులైన భాషా పండితుల్లో కొంత మందికి గతంలోనే గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 పదోన్నతులు కల్పించారు. చివరిగా 2019లో కొంత మందికి పదోన్నతులు ఇచ్చి, మిగిలిన వారిని డీఈవో పూల్‌లో ఉంచేశారు. దీనిపై భాషా పండితులు గత ప్రభుత్వంతో పోరాడినా ఫలితం దక్కలేదు. డీఈవో పూల్‌లో ఉన్న కారణంగా టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ జరిగిన ప్రతిసారీ వీరికి బదిలీలు తప్పనిసరయ్యేవి. దీంతో ఎక్కడా రెండేళ్లకు మించి పనిచేయలేకపోయారు. సాధారణంగా ఒకచోట బదిలీ అయితే ఎనిమిదేళ్ల వరకు అక్కడే పనిచేసుకునే వెసులుబాటు ఎస్జీటీ/స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లకు ఉంది. కానీ డీఈవో పూల్‌లోని భాషాపండిట్లకు ఈ అవకాశం కల్పించలేదు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, తదితరులు ఈ సమస్యను మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఈ మేరకు డీఈవో పూల్‌లో ఉన్న ఉమ్మడి జిల్లా పరిధిలోని 75 మంది తెలుగు, ముగ్గురు హిందీ పండితులకు అడహక్ బేసిక్ ప్రాతిపదికన పదోన్నతులు కల్పిస్తూ విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. దీనివల్ల ఇప్పటికే క్లస్టర్ స్కూళ్ల పరిధిలో పనిచేస్తున్న పండితులు అక్కడే పనిచేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు క్లస్టర్ స్కూళ్ల పరిధిలో (ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల వరకు) ఎక్కడైనా టీచర్లు సెలవు పెడితే అక్కడికి వెళ్లి బోధించాల్సి వచ్చేది. తాజా పదోన్నతుల నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న చోటే పని చేయాలి. అంతేకాదు వచ్చే ఏడాది నిర్వహించే బదిలీ కౌన్సెలింగ్‌లో మిగిలిన టీచర్లతోపాటు వీరికీ అవకాశం కల్పిస్తారు. కాగా ఆరేళ్ల నుంచి పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న తమకు న్యాయం చేసిన ప్రభుత్వానికి, సహకరించిన మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్సీలు, ఇతర నేతలకు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు ... మిగతా 4వ పేజీలో

త్రుటిలో తప్పిన ప్రమాదం

విజయరామరాజుపేట కాజ్‌వే వద్ద టాటా ఏస్ గూడ్స్ వాహనం బోల్తా

- సురక్షితంగా బయటపడిన డ్రైవర్
- ప్రమాదంతో స్పందించిన కాంట్రాక్టర్
- సిమెంట్ మిక్చర్‌తో రోలింగ్ పనులు
- అన్ని వాహనాల రాకపోకలకు అనుమతి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయరామరాజుపేట కాజ్‌వే వద్ద ఆదివారం ఉదయం టాటాఏస్ గూడ్స్ వాహనం అదుపుతప్పి తాచేరు గెడ్డ వైపునకు ఒరిగింది. అదృష్టవశాత్తూలో నీటిలో పడకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం, గూడ్స్ వాహనం డ్రైవర్ అనాలోచితంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కాగా కాజ్‌వేపై సిమెంట్ మిక్చర్‌తో రోలింగ్ చేసి, ఆదివారం సాయంత్రం నుంచి అన్ని రకాల వాహనాల రాకపోకలకు అధికారులు అనుమతిచ్చారు.



ఆదివారం సాయంత్రం నుంచి అందుబాటులోకి వచ్చిన కాజ్‌వే



విజయరామరాజుపేట కాజ్‌వే వద్ద పక్కకు ఒరిగిన టాటాఏస్ గూడ్స్ వాహనం

ఆగస్టు రెండో వారంలో భారీ వర్షాలు పడి, తాచేరు గెడ్డకు వరద రావడంతో విజయరామరాజుపేట వద్ద కాజ్‌వే కొట్టుకుపోయింది. అప్పటి నుంచి నదిలో వరద ప్రవాహం తగ్గకపోవడంతో ... మిగతా 4వ పేజీలో

ఎలమంచిలిలో భారీ వర్షం

రహదారులన్నీ జలమయం

- పొంగిన శేషుగెడ్డ.. స్తంభించిన ట్రాఫిక్



శేషుగెడ్డ పొంగడంతో నిలిచిపోయిన వాహనాలు



ఎలమంచిలిలో కురుస్తున్న వర్షం

ఎలమంచిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):

ఎలమంచిలి పట్టణంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఏడు గంటల నుంచి ఎనిమిదిన్నర గంటల వరకు సుమారు గంటన్నరపాటు ఉరుములు, పిడుగుల మోతతో కుండపోతగా వాన పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండకాసి, వాతావరణం సాధారణంగానే వుంది. అయితే చీకటి పడిన తరువాత ... మిగతా 4వ పేజీలో

క్రీడలతో మానసికోల్లాసం

▸ మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఫైర్‌ఆఫీసు కాలనీ సచివాలయం వద్ద హేపీ సండే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్రీడల్లో విజేతలకు ఆమె బహుమతులను అందజేవారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, ఆటల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఉండా దేముళ్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి సమితి జిల్లా స్థాయి వర్క్‌షాపు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎలమంచిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయి సేవాసమితి మందిరం ఆవరణలో ఆదివారం జిల్లా స్థాయి భజన వర్క్‌షాపు కార్యక్రమాన్ని నిర్వహించారు. నవంబరు 23వ తేదీన ఎంతో అట్టహాసంగా నిర్వహించే సత్యసాయి జయంతిని విజయవంతం చేసేందుకు కార్యచరణ సిద్ధం చేసినట్టు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కె.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఈవర్క్‌షాపులో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సత్యసాయి భక్తులు, ప్రతినిధులకు రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు పలు సూచనలు చేశారు. కల్చరల్ విభాగం రాష్ట్ర ఇన్‌చార్జి జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఎంతో అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయవరం సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో భాగంగా ఎస్.రాయవరం పట్టణం, సర్వసిద్ధి, వాతాడ ఆక్వా సర్వీసులు, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీ పాలెం, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, వమ్మవరం, గెడ్డపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

ఎలమంచిలిలో..

పెదపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపాలిటీలోని ఎలమంచిలి పట్టణం, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడు పాలెం, కొత్తపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు గమనించాలని తెలిపారు.

క్లాస్‌మేట్ కుటుంబానికి ఆర్థిక సహాయం



తోటి విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న సహవిద్యార్థి కుటుంబానికి క్లాస్‌మేట్స్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జంగులూరుకి చెందిన మాసవరపు అప్పలరాజు అనారోగ్యం కారణంగా అకాలమరణం చెందారు. విషయం తెలుసుకున్న 2003-2004 బ్యాచ్ పదో తరగతి క్లాస్‌మేట్స్ రూ. 55 వేలు ఆదివారం వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

13 నుంచి అయ్యప్పస్వాములకు భిక్ష



సమావేశంలో మాట్లాడుతున్న పెంటకోట ఉమేష్

మునగపాక, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13వ తేదీ నుంచి నవంబరు 21వ తేదీ వరకు అయ్యప్పస్వామిలకు ఉచితంగా భిక్ష ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు పెంటకోట ఉమేష్ తెలిపారు. స్థానిక అయ్యస్వామి ఆలయం వద్ద ఆదివారం గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో ఈ ఏడాది 41 రోజులు పాటు అయ్యప్పస్వామిలకు ఉచితంగా భిక్ష ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, వేగి లక్ష్మణరావు, కాండ్రేగుల జగ్గారావు, పెద్దలు డొక్కా నాగభూషణం, బద్దెం సూర్యనారాయణ, విల్లూరి నూకనర్సింగరావు, ఆడారి కాశిబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

పాయకరావుపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట చెక్కానగర్ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇందుకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే స్టేషన్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేటలోని చెక్కానగర్ వెనుక ఆదివారం సాయంత్రం 40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడన్నారు. మృతుడి ఒంటిపై నీలం రంగు ఫుల్ హ్యాండ్స్ బనియన్, సిమెంట్ రంగు ఫ్యాంటు ఉన్నాయని, మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

సాగునీటి వనరులకు జలకళ

- ▸ చెరువుల్లో పుష్కలంగా నీరు
- ▸ ఉధృతంగా ప్రవహిస్తున్న వరహా, సర్పా నదులు
- ▸ పొంగుతున్న వాగులు, వంకలు
- ▸ ఆనందంలో అన్నదాతలు



సుంకపూర్ పెద్దచెరువులో చేరిన నీరు

కోటవురట్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగునీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. సర్పా, వరహా నదులు మొదలు, వాగులు, వంకలు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. వరహా, సర్పా నదులు ఇంకా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గత నాలుగేళ్ల కంటే ఈ ఏడాది అధికంగా వర్షాలు కురవడంతో ఖరీఫ్‌లో పంటల సాగునీరు ఢోకా లేదని రైతులు ఆనందపడుతున్నారు.

మండలంలో ఇటీవల కురిసిన వర్షాలతో సాగునీటి వనరుల్లోకి నీరు పుష్కలంగా చేరింది. ఆగస్టు నెలలో 159.6 సాధారణ వర్షపాతం కాగా 237.1 వర్షపాతం నమోదైంది. సెప్టెంబరు నెలలో 169.3 సాధారణ వర్షపాతం కాగా, 167.3 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. మండలంలో 68 సాగునీటి చెరువులున్నాయి. ఈ వర్షాలకు నీరు వాగులు, వంకల ద్వారా నదుల్లోకి చేరుతున్నాయి. ఇంచుమించు అన్ని చెరువులు నిండుగానే కనిపిస్తున్నాయి. బోర్లు నీటిమట్టం గణనీయం పెరిగింది. ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు, ప్రజలకు తాగునీరు కొరత ఉండదని అధికారులు చెబుతున్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవం

హాజరైన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు



ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్



మునగపాక: ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో గీతం ఆలపిస్తున్న కార్యకర్త

రాంబిల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్ ఆవరణలో ఆదివారం సాయంత్రం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత స్వయంసేవక్‌లు పతాక ఆవిష్కరణ నిర్వహించి రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎంపీ పప్పల చలపతిరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1925లో విజయదశమి రోజున ప్రారంభమైన ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. దేశంలో హిందూ ధర్మపరిరక్షణతో పాటు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ప్రజలలో జాతీయ భావం, దేశభక్తి పెంపొందిస్తుందన్నారు. జిల్లా ప్రచారక్ హరి ఈ కార్యక్రమం ఆవశ్యకతను తెలిపారు. నిర్వాహకులు వర్మరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు వి.దిన్‌బాబు, పలువురు నేతలు చిన్నారావు, కె. రఘు, బాబ్జి, హరి, గిరి, కోటాపు వడ్డీకాసులు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో..

దేశం కోసం, ధర్మం కోసం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) విశిష్ట సేవలందిస్తోందని కశింకోట ఖండ సంఘ్ చాలక్ ఐనాల అప్పారావు అన్నారు. స్థానిక నందీశ్వర ప్రాంగణంలోని తులసీ కళావేదిక వద్ద ఆదివారం జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణ, సేవా గుణం వంటి మంచి లక్షణాలు అందించడమే కాకుండా దేశ గౌరవాన్ని కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరణ, విశిష్ట సేవలందించిన నేతలకు నివాళ్లు, దండ ప్రయోగ్ ఆసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు బద్దెం సూర్యనారాయణ, శాస్త్రవేత్త చదరం శివాజీ, వాసు, బద్దెం ప్రతాప్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, నాగులాపల్లికి చెందిన వివేకానంద బాల శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంధకారంలో అంబేడ్కర్ కాలనీ



అంబేడ్కర్ కాలనీలో వీధిలైట్లు వెలగక చీకటి అలుముకున్న దృశ్యం

పాయకరావుపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ కాలనీలో వీధి లైట్లు వెలగక అంధకారం నెలకొంది. పట్టణంలో జాతీయ రహదారి అవతల ఉన్న అంబేడ్కర్ కాలనీలో సుమారు 200 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ కాలనీలో వీధిలైట్లు గత కొంత కాలంగా వెలగడం లేదు దీంతో వీధి కుక్కలతో పాటు సమీపంలో ఉన్న తుప్పల్లో నుంచి పాములు, తేళ్ళు బయటకు వచ్చి కాలనీ రోడ్లపై తిరుగుతుండడంతో చీకటి పడితే ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన కువల కుమార్ తదితరులు మాట్లాడుతూ గత రెండేళ్లుగా కాలనీలో వీధిలైట్లు వెలగడం లేదని ఫిర్యాదు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని వాపోయారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలున్న మండల పరిషత్ కాంప్లెక్స్‌కి పక్కనే ఉన్న తమ కాలనీలో కాలువలకు అవుట్‌లెట్లు లేక ఎక్కడపడితే అక్కడ మురికినీరు, చెత్తతో నిత్యం పారిశుధ్యం లోపిస్తుందన్నారు. తాగునీటి సరఫరా కూడా అంతంతమాత్రంగానే ఉంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం జిల్లా అధికారులైనా స్పందించి అంబేడ్కర్ కాలనీలో సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

ముస్లిం గ్రామాల్లో ఘనంగా గ్యార్మీ షరీఫ్ ఉర్సు ఉత్సవం



నక్కపల్లి: పెదబోదిగల్లంలో అశ్వాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం, రామకృష్ణాపురం, చినబోదిగల్లం, పెదదొడ్డిగల్లు తదితర ముస్లిం గ్రామాల్లో ఆదివారం గ్యార్మీ షరీఫ్ ఉరుసు ఉత్సవాన్ని ఘనంగా ముస్లిం సోదరులు జరుపుకున్నారు. ముందుగా ముస్లిం ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేక నమాజ్‌లు చేశారు. అనంతరం దర్గాలను అలంకరించారు. అశ్వాలను అలంకరించి ఊరేగించారు.

కోటవురట్లలో..

కోటవురట్ల ముస్లిం కాలనీలో హజ్రత్ మహబూద్ సుభాని 31వ గందోత్సవ వేడుకలను ముస్లిం సోదరులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు గుర్రంపై గంధం ఉంచి ఊరేగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నసంతర్పణ చేపట్టారు.కోటవురట్ల ఎంపీటీసీ సభ్యుడు పీ సూర్యారావు, మండల కోఆప్షన్ మెంబరు బుధా భాషా పాల్గొన్నారు.

సీపీఎం నేత అప్పలరాజు గృహ నిర్బంధం



ధర్మవరం అగ్రహారంలో సీపీఎం నేత అప్పలరాజును గృహ నిర్బంధం చేసిన పోలీసుల

ఎస్.రాయవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారంలో గల నివాసముంటున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును ఆదివారం పోలీసులు ముందస్తు గృహ నిర్బంధం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్స్ పార్కును వ్యతిరేకిస్తున్న మత్స్యకారులకు మద్దతివ్వడం కోసం ఆదివారం బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ వస్తున్నారు. ఆయన్ని కలిసేందుకు వెళుతున్న అప్పలరాజును పోలీసులు గృహనిర్బంధం చేశారు. అక్రమంగా గృహ నిర్బంధాలతో తమ పోరాటాలను ఆపలేరని ఎం. అప్పలరాజు అన్నారు.

నక్కపల్లిలో నిరసన

బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా తాము జరుపుతున్న ఆందోళన, నిరసన దీక్షలకు మద్దతిచ్చే వారిని పోలీసులు గృహనిర్బంధాలు చేయడం తగదని మత్స్యకార నేతలు ఎం.మహేశ్‌బాబు, పీ నల్ల, జీ సోమేశ్వరరావు, బి బాబ్జీ, సోమేశ్, కాశీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీ రాంచంద్ర యాదవ్‌ను రాజమండ్రిలో నిర్బంధించడం, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, తదితర నేతలను పోలీసులు గృహ నిర్బంధాలు చేశారన్నారు. కార్యక్రమంలో పి.తాతీలు, వి.సత్తియ్య, కాశీరావు, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును పోలీసులు గృహ నిర్బంధం చేయడం అన్యాయమని సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు కొత్తపట్నం సముద్ర తీరంతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శంకరరావు, మండల కార్యదర్శి జి.దేముడునాయుడులు మాట్లాడుతూ మత్స్యకారులు చేస్తున్న పోరాటాలకు మద్దతు ఇస్తున్న సీపీఎం నాయకులను గృహనిర్బంధం చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నారాయణరావు, రామకృష్ణ, కాసియ్య, వై.రాము, సీహెచ్ అప్పలరాజు, రమణ, శివాజీ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

▸ పీఏసీఎస్ చైర్‌పర్సన్ విజయ్‌బాబు



పురుషోత్తపురంలో ఎన్టీఆర్ యూత్ ప్రతినిధులు శ్రమదానంతో గ్రామాన్ని పరిశుభ్రం చేస్తున్న నేతలు

ఎలమంచిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యకుడు ఎన్టీఆర్ స్ఫూర్తితో గ్రామంలో ప్రతివారం శ్రమదానంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో ఎంతో ఆనందంగా ఉందని లక్కవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొలుకులూరి విజయ్‌బాబు, టీడీపీ మండల యూనిట్ ఇన్‌చార్జి రాజాన వెంకునాయుడు అన్నారు. ఆదివారం పురుషోత్తపురం గ్రామంలో ఏక్ దిన్, ఏక్ గంట్, ఏక్ కుసాత్ కార్యక్రమంలో భాగంగా వీరితో పాటు స్థానిక టీడీపీ నేతలంతా కలిసి గ్రామంలో ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని గ్రామంలో ఎన్టీఆర్ యూత్ పేరిట సంఘాన్ని ఏర్పాటు చేసుకుని గత కొన్ని నెలలుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. టీడీపీ నేతలకు అండగా యువత కూడా ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రధాన వీధులతో పాటు స్కూలు పరిసరాల్లోని చెత్తను తొలగించి, బ్లీచింగ్ పిచికారీ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాన సత్యనారాయణ, కాళ్ల సత్యనారాయణ, శ్రీను, ఎన్టీఆర్ యూత్ యువత పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంబరాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు, టీడీపీ నేతలు

ఎస్.రాయవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రవేశపెట్టడంపై మండలం కేంద్రంలో ఆదివారం ఆటో డ్రైవర్లు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక గురజాడ అప్పారావు విగ్రహం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా రాష్ట్రంలో అందరూ బాగుండాలన్నదే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పరిపాలన సాగిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమలో టీడీపీ నాయకులు సోమిరెడ్డి రాజు, కొణతాల శ్రీనివాసరావు, భీమశెట్టి శ్రీనివాసరావు, బత్తుల వాసు, దివానం, జనసేన నాయకులు వీసం ప్రసాద్, చిరంజీవి, వీసం సాయి తదితర నాయకులు ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సందిగ్ధంలో సాగుదారులు

... 3వ పేజీ తరువాయి

తోటల్లో నిర్వహణ, సస్యరక్షణ పనులు చేపట్టి, ఎరువులు వేయాల్సిన సమయం వచ్చింది. పరిశ్రమల కోసం భూములను ఎప్పుడు తీసుకుంటారో అధికారులు చెప్పకపోవడంతో తోటల్లో ఆయా పనులు చేయాలా? వద్దా? అన్న సందిగ్ధంలో రైతులు వున్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే గ్రామసభ ఏర్పాటుచేసి, భూములు ఎప్పుడు తీసుకుంటారు? పరిహారం ఎంత ఇస్తారు? అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని ఆయా సాగుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పక్కాగా ఆస్తి పన్ను వసూళ్లు

... 3వ పేజీ తరువాయి

పన్ను మదింపు చేస్తున్నారు. అలాగే వారసత్వంగా వచ్చిన స్థలం ఉండి, దస్తావేజులు లేక ప్లాన్ అనుమతులు తీసుకోకుండా నిర్మించిన ఇళ్లను, అదే విధంగా ప్లాన్ అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్లు గుర్తిస్తున్నారు. కాగా మునిసిపాలిటీలో ఆస్తి పన్ను డిమాండ్ రూ.5.9 కోట్లు ఉంది. సర్వేలో గుర్తించిన కొత్త ఇళ్లు, అదనపు నిర్మాణాలను కలుపుకుంటే ఈ ఆదాయం మరికొంత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

బాబోయ్ కుక్కలు!

... 3వ పేజీ తరువాయి

కుక్కల గుంపు దాడి చేసి గాయపరిచాయి. ఇలా పలు గ్రామాల్లో కుక్కల స్వైర విహారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్క కాటు బాధితుల్లో పలువురు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి, విశాఖపట్నం కేజీహెచ్‌కి, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకున్నారు. కాగా మండలంలో కొంతకాలం నుంచి కుక్క కాటు కేసులు పెరుగుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ చక్రవర్తి చెబుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

భాషా పండిట్లకు పదోన్నతులు

... 3వ పేజీ తరువాయి

వై.దయానంద్ ధన్యవాదాలు తెలిపారు.

అంతర్ జిల్లా బదిలీ టీచర్లకు పోస్టింగ్స్

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాకు బదిలీపై వచ్చిన 48 మంది ఉపాధ్యాయులకు విద్యా శాఖ పోస్టింగ్స్ ఇచ్చింది. వీరిలో 16 మంది స్కూల్ అసిస్టెంట్, 32 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. ఎక్కువమందికి కేటగిరీ 3, 4 పరిధిలోని పాఠశాలల్లో పోస్టింగ్స్ దక్కాయి. దీనిపై కొందరు టీచర్లు అభ్యంతరం వ్యక్తంచేసి ఆందోళనకు దిగినా.. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఏజెన్సీ మారుమూల ప్రాంత పాఠశాలల్లో నియమించారు.

ఎలమంచిలిలో భారీ వర్షం

... 3వ పేజీ తరువాయి

అనూహ్యంగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై భారీ వర్షం పడింది. పిడుగులు పడుతుండడంతోపాటు గాలి కూడా వీస్తుండడంతో ముందు జాగ్రత్త చర్యగా ఈపీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కాగా భారీ వర్షం కారణంగా పట్టణంలో వీధి రోడ్లతోపాటు ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు, ఎంపీడీఓ కార్యాలయం రోడ్డు, క్లబ్ రోడ్డు, కొత్తపేట రోడ్డు, తదితర చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోయింది. డ్రైనేజీలు పొంగడంతో రహదారులపై బురద, చెత్తాచెదారం పేరుకుపోయాయి. కాగా ఎగువున్న వున్న పెదపల్లి ప్రాంతంలో కురిసిన వర్షంతో శేషుగెడ్డకు భారీగా వరద వచ్చింది. రాత్రి 9.30 గంటల సమయంలో గెడ్డ పొంగి, పాత జాతీయ రహదారి మీదుగా నీరు ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

త్రుటిలో తప్పిన ప్రమాదం

... 3వ పేజీ తరువాయి

పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. ఎట్టకేలకు వారం రోజుల క్రితం వరద ఉధృతి నెమ్మదించడంతో కాజ్‌వే పనులు మొదలుపెట్టారు. తొలుత సిమెంట్ పైపులు అమర్చి, వాటిపై గ్రావెల్ వేసి చదును చేశారు. రెండు రోజుల నుంచి ద్విచక్ర వాహనాలను, పాదచారులను రాకపోకలకు అనుమతించారు. సిమెంట్, మెటల్ మిక్సర్ వేసి, రోలింగ్ చేసిన తరువాత ఇతర వాహనాలను అనుమతిస్తామని అధికారులు చెప్పారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి సిమెంట్, మెటల్ మిక్సర్ తెచ్చి కుప్పలు పోశారు. ఆదివారం ఈ కుప్పలను సరిచేసి రోలింగ్ చేయాల్సి వుంది. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్.. కాజ్‌వే మీదుగా ద్విచక్ర వాహనాలు కాకుండా మిగిలిన వాహనాలు వెళ్లకుండా ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆదివారం ఉదయం చోడవరం వైపు నుంచి వడ్డాది వైపు వస్తున్న టాటా ఏస్ గూడ్స్ వాహనం కాజ్‌వే మీదుగా వెళ్లడానికి డ్రైవర్ ప్రయత్నించాడు. సగభాగంలో సిమెంట్ మిక్సర్ వుండడంతో, మిగిలిన సగభాగంలో నుంచి వెళ్లే క్రమంలో మిక్సర్ కుప్పపైకి ఎక్కి నది ప్రవాహం వైపునకు ఒరిగిపోయింది. అయితే అదృష్టవశాత్తూ నీటిలో పడకపోవడంతో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం గురించి తెలుసుకున్న కాజ్‌వే కాంట్రాక్టర్.. వెంటనే కూలీలను రప్పించి సిమెంట్ మిక్సర్ కుప్పలను కాజ్‌వేపై పరిచి రోలింగ్ చేయించారు. ఆదివారం సాయంత్రానికి పనులు పూర్తికావడంతో అన్ని రకాల వాహనాల రాకపోకలకు అనుమతిచ్చారు. కాగా కాజ్‌వేకు ఇరుపక్కలా రక్షణ కోసం చిన్నపాటి కర్రలు పాతారు. రాత్రిపూట ఈ కర్రలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం వుంది. రేడియం స్టిక్కర్లతో ఇనుప రెయింగ్ బిగించి, లైట్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

తుమ్మపాల ముంగిటకు మరిన్ని వైద్య సేవలు



తుమ్మపాలలో నిర్మాణంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

▸▸ ఇప్పటికే పీహెచ్‌సీ ద్వారా గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణ

▸▸ ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా అదనంగా రెండు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు

తుమ్మపాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాల ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత చేరువ కానున్నాయి. ఇప్పటికే ఈ పంచాయతీ పరిధిలో గల పీహెచ్‌సీలో అందుతున్న సేవలతో పాటు ప్రభుత్వ నిర్ణయంతో మరో రెండు అదనపు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ పంచాయతీలో 18 వార్డులు ఉండగా, దాదాపు 20వేల మందికి పైగా ప్రజలు నివాసం ఉంటున్నారు. తుమ్మపాలలో గల పీహెచ్‌సీ నుంచి వీరికి నిత్యం ఆరోగ్య సేవలను వైద్య సిబ్బంది అందిస్తున్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులతో పాటు 23 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే వైద్య సేవలను గ్రామ ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ప్రభుత్వం గ్రామ నడి బొడ్డున రెండు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది ఒక్కొక్కదానికి రూ.42 లక్షలు చొప్పున నిధులను మంజూరు చేసింది. ఇప్పటికే కొణతాల దిబ్బ వద్ద విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు



మెయిన్ రోడ్డు పక్కన మరో క్లినిక్ భవనానికి సిబ్బంది స్థల పరిశీలన

ప్రారంభమై యాభై శాతం పనులు పూర్తి కాగా, సంతబయలు వద్ద మరో విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసేందుకు ఇటీవల అధికారులు, ప్రజాప్రతినిధులు స్థల పరిశీలన చేశారు.

కొత్తగా నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిత్యం ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉండి గ్రామస్థులకు వైద్యసేవలు అందించనున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యులు సైతం అందుబాటులో ఉంటారు. అలాగే విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో గర్భిణులు, చిన్నారులకు నిత్యం వైద్య సేవలు అందించనున్నారు. అవసరమైన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందుల పంపిణీ చేస్తారు. సంచార చికిత్సలో భాగంగా ఈ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ప్రతి నెల రెండుసార్లు 104 బృందం ద్వారా నిపుణులైన డాక్టర్లు వైద్యసేవలను అందించనున్నారు. ఎప్పటికప్పుడు హెల్త్ సర్వేలు, టీకాలు వేయనున్నారు. ప్రతి ఇంటిని వైద్య సిబ్బంది సందర్శించి ఆరోగ్య సేవలు విస్తరించనున్నారు. దీంతో పాటు తుమ్మపాల పరిసర ప్రాంతాల్లో ఉండే ప్రజలకు, సంచార జాతుల వారికి ఈ సేవలను మరింత విస్తరిస్తారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. తుమ్మపాలకు అదనంగా మరో రెండు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు చేయడం ఆనందదాయకం. దీంతో గ్రామ ప్రజలకు వైద్యం మరింత చేరువ కానుంది. అర్ధరాత్రి సైతం వైద్య సేవలను పొందుకునేందుకు వెసులుబాటు కలుగుతుంది.

- కర్రి బాబి, టీడీపీ మండల అధ్యక్షుడు

ప్రతి ఇంటికీ ఆరోగ్య సేవలే లక్ష్యం



తుమ్మపాల ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామ ప్రజలకు, సంచార జాతులకు నిత్యం ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గ్రామంలో మరో రెండు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తుండడంతో వైద్య సిబ్బందికి మరింత సౌకర్యంగా ఉంటుంది. స్వేచ్ఛగా వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ వాణి జగదీశ్వరి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి

భక్తులతో నూకాంబిక ఆలయం సందడి

▸▸ ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి రాక

▸▸ పసుపు, కుంకుమలు సమర్పించి అమ్మవారికి మొక్కులు



బాలాలయంలో అమ్మ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. తెల్లవారు జామున బాలాలయంలో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తూనే ఉన్నారు. పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబాలతో విచ్చేసినవారు ఆలయం ఆవరణలో వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించగా, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



క్యూలైన్ల ద్వారా నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భావితరాలను శక్తివంతంగా తయారు చేయాలి

▸▸ డీఎస్సీ- 2025 ఉపాధ్యాయుల శిక్షణలో డీఈవో అప్పారావునాయుడు



యోగాసనాలపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్లు, చిత్రంలో డీఈవో

సబ్బవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : యోగాపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకుని తద్వారా భావితరాలను శక్తివంతంగా తయారు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న డీఎస్సీ- 2025 ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని ఆదివారం సందర్శించి మాట్లాడారు. ఈ నెల పదో తేదీ వరకు శిక్షణ శిబిరాలు కొనసాగుతాయన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసు కొచ్చేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని, అందులో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డీఆర్‌పీలు, ఎంఈవోలు, ట్రైనర్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు. అంతకు ముందు అంతా కలిసి యోగా, ధ్యానం చేశారు.

జనసేన కార్యకర్తల కుటుంబాలకు బీమా చెక్కులు



బాధిత కుటుంబాలకు నమూనా చెక్కు అందిస్తున్న రాంకీ, తదితరులు

కశింకోట, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్తల కుటుంబాలకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ఆదివారం ప్రమాద బీమా చెక్కులు అందజేశారు. ఇటీవల వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందిన తోరం చిన్నంనాయుడు, మట్టా శ్రీనుల నివాసాలకు వెళ్లి ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చెక్కులను అందించారు. కూటమి ప్రభుత్వంలో కార్యకర్తలకు అన్నివిధాలా మేలు జరుగుతుందని, ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గొంతిన శ్రీను, ఉగ్గిన రమణమూర్తి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కర్రి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణల ఫలితం సామాన్యులకు దక్కాలి

▸▸ వ్యాపార సంస్థల వద్ద పాత, కొత్త ధరల బోర్డులు ఏర్పాటు చేయాలి

▸▸ కన్జూమర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు 'కాండ్రేగుల'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీలో సంస్కరణల నేపథ్యంలో వ్యాపార సంస్థల వద్ద వస్తువుల పాత, కొత్త ధరల బోర్డులను ఏర్పాటు చేయాలని కన్జూమర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ కోరారు. దీనివల్ల వస్తువు ధర ఎంత మేర తగ్గిందనేది కొనుగోలుదారులకు తెలుస్తుందన్నారు. ఇక్కడి పబ్లిక్ ఫోరం కార్యాలయంలో ఆదివారం 'జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు- వినియోగదారుల హక్కులు' అంశంపై వినియోగదారుల సంఘాల ప్రతినిధులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపు ధరలు క్షేత్రస్థాయిలో వినియోగదారులకు తెలియడం లేదన్నారు. ధరలను అదుపు చేయాల్సిన అధికార యంత్రాంగం మొక్కుబడిగా అవగాహన సదస్సులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే జీఎస్టీ ఎంత తగ్గుతుందో తెలుస్తుందన్నారు. ఏసీలు, టీవీలు, వివిధ ఎలక్ట్రికల్ పరికరాలు, వాహనాలు వంటి పెద్ద వస్తువులకు జరుగుతున్న తగ్గింపు ధరల ప్రచారం నిత్యం సామాన్యులు వినియోగించే వస్తువులకు జరగకపోవడం విచారకరమన్నారు. ఈ సమావేశంలో వినియోగదారుల సంఘాల ప్రతినిధులు రెడ్డి సత్యనారాయణ, ఎస్.నూకరాజు, సుందరపు సంజీవరావు, బొడ్డేడ జగ్గఅప్పారావు, పైలా రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాండ్రేగుల వెంకటరమణ

విత్తన బంతులతో ఆహ్లాదకర వాతావరణం

▸▸ జిల్లా అటవీ శాఖాధికారి సోమసుందర్



విత్తన బంతులు విసిరే కార్యక్రమంలో డీఎఫ్‌వో, గ్రీన్‌క్లబ్ ప్రతినిధులు

కొత్తూరు, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనం పెంచేందుకు విత్తన బంతులు ఎంతగానో దోహదపడతాయని జిల్లా అటవీ శాఖాధికారి ఎం.సోమసుందర్ అన్నారు. ఇక్కడి సత్యనారాయణపురం కళ్యాణ గిరిపై ఆదివారం గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు వేలకుపైగా విత్తనబంతులు విసిరే కార్యక్రమ ంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. విత్తన బంతులతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ఇందుకోసం మొక్కలు నాటాలని సూచించారు. సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ అప్పికొండ గణేశ్ మాట్లాడుతూ గ్రీన్ క్లబ్ గత పదకొండు సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం విత్తన బంతులను కొండపై నుంచి విసిరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు అసిస్టెంట్ డ్రగ్స్ కంట్రోలర్ కాండ్రేగుల సూర్య సత్యనారాయణ, రిటైర్డు అటవీ శాఖాధికారి బీరా వినోద్‌కుమార్, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, గ్రీన్ క్లబ్ ప్రతినిధి కొణతాల పణిభూషణ్ శ్రీధర్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బొట్టవానిపాలెం వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు గ్రామస్థుల వినతి

పరవాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : గాజువాక- ఎలమంచిలి ప్రధాన రహదారిలోని బొట్టవానిపాలెం వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఇటీవల కాలంలో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల పలువురు వాహనదారులు మితిమీరిన వేగంతో వెళుతున్న కారణంగా ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. అలాగే రహదారికి ఆనుకొని నివాసాలు ఉన్నాయని, ఏదైనా పనిమీద వెళ్లేటప్పుడు రహదారి దాటాలంటే భయంగా ఉందని అంటున్నారు. గడచిన ఐదు నెలల వ్యవధిలో మూడు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృతి చెందగా, మరో నలుగురు గాయాలకు గురయ్యారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

'బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును వెంటనే రద్దు చేయాలి'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామ పర్యటనకు బీసీవై నేత బోడే రామచంద్రయాదవ్ వస్తున్న నేపథ్యంలో పోలీసులు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు ఎం.అప్పలరాజును గృహ నిర్బంధం చేయడాన్ని ఆయన ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న మత్స్యకారుల అభిప్రాయాలను గౌరవించి, బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాల్సింది పోయి వారికి మద్దతుగా నిలుస్తున్న నాయకులపై కక్షగట్టడం తగదని పేర్కొన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి న్యూ కాలనీలోని రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొలుత రోటేరియన్ కోరుకొండ బుచ్చిరాజు శిబిరాన్ని ప్రారంభించారు. కేర్ ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు జరిపారు. బీపీ, షుగర్, దంత పరీక్షలు చేపట్టారు. 120 మంది వరకు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. క్లబ్ ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, కేవీపీఎస్ ప్రకాశరావు, బి.సూర్యారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్‌కు డీపీఎన్ పాఠశాల విద్యార్థి ఎంపిక



కేశవ

కశింకోట, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఇక్కడి డీపీఎన్ పాఠశాల విద్యార్థి బి.కేశవ ఎంపికయ్యాడు. విశాఖ లోని గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి జట్టు ఎం పికలో కేశవ అద్భుత ప్రతిభ చూపి అర్హత సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు ఎన్‌జేవీ ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు

రావికమతం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.పొన్నవోలు గ్రామ సమీపంలో బీఎన్ రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఆదివారం జరిగిన ఈ సంఘటనలో ఐదుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలివి. రోలుగుంట మండలం కోమరవోలుకు చెందిన బండారు మనోవరహా వినయ్, బాలతేజ, వంటాకుల మదన్‌కుమార్ శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై రావికమతం నుంచి కోమరవోలు స్వగ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో టి.అర్జాపురం గ్రామానికి చెందిన రాజాన జనార్ధన్, తన బంధువైన మత్స్యవానిపాలేనికి చెందిన సాయితో బైకుపై మేడివాడ వైపు వెళ్తున్నాడు. పి.పొన్నవోలు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారన్నారు.

గెడ్డ వాగులో ఇష్టారాజ్యంగా ఫార్మా వ్యర్థ జలాలు



మల్లోడిగెడ్డలో ఫార్మా వ్యర్థాలు కలవడంతో నల్లగా మారిన నీరు

పరవాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ నుంచి భరణికం వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న మల్లోడిగెడ్డలో పేరుకుపోయిన ఫార్మా వ్యర్థ జలాలను మోటారు సాయంతో తోడించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మల్లోడి గెడ్డవాగులో గల ఫార్మా వ్యర్థ జలాలను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాంకీ యాజమాన్యం ఫార్మా వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా మల్లోడిగెడ్డ వాగులోకి విడిచిపెట్టడంతో పూర్తిగా కలుషితమైపోయిందన్నారు. దీనివల్ల భూగర్భ జలాలకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యర్థ జలాలను సీఈటీపీ ద్వారా శుద్ధి చేసి సముద్రంలోకి విడిచి పెట్టాల్సి ఉన్నప్పటికీ, అలా చేయకుండా నేరుగా బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని మండిపడ్డారు. రాంకీ యాజమాన్యం తీరు కారణంగా పరవాడ, భరణికం, తానాం, తాడి, ఇ.బోనంగి, లంకెలపాలెం, సాలాపువానిపాలెం ప్రజలు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు రాంకీ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైందని ఆరోపించారు. తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చిరు వ్యాపారులకు ఉపాధి కల్పించాలి

తుమ్మపాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అధికారులు చిరు వ్యాపారుల బడ్డీలను తొలగించడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని, తక్షణమే వారికి ఉపాధి చూపించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోన లక్ష్మణ్ ఒక ప్రకటనలో కోరారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీధి వ్యాపారుల పొట్ట కొట్టడం అధికారులకు తగదని పేర్కొన్నారు. వారి పరిస్థితిని అర్థం చేసుకుని ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలని విజ్ఞప్తి చేశారు.

దేమునిగుమ్మం వెంకన్న ఆలయంలో ఉపాలయాల భూమి ఆక్రమణ

▸▸ కబ్జాదారులపై పోలీసులకు దేవదాయ శాఖ ఫిర్యాదు ▸▸ ఆలస్యంగా వెలుగు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గల ఉపాలయాల స్థలం ఆక్రమణలపై ఆలయ ఈవో మురళీకృష్ణ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ అంశానికి సంబంధించిన వివరాలివి. శ్రీవారి ఆలయంలోని ఉపాలయాలైన సత్యనారాయణస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాల ధూప దీప నైవేద్యం, అర్చకుల భృతి నిమిత్తం చింతావారి డిపోగా పిలవబడే 60 సెంట్ల భూమిని వేదుల చైనులు దేవాలయానికి గతంలో దానం చేశారు. సదరు భూమిని అప్పటి అర్చకులు వంగ తోట వేసుకొని పండించి బతుకుతూ స్వామివారికి ధూప, దీప నైవేద్యాలు చేసేవారని ఆలయ అధికారులు చెబుతున్నారు. కాలక్రమంలో చింతా రామ్మూర్తి సుమారు ముప్పై మూడున్నర సెంట్ల భూమిని లీజుకు తీసుకున్నారని తెలిలిసింది. మిగిలిన స్థలంలో ఇద్దరు వ్యక్తులు అద్దె చెల్లిస్తున్నారు. అయితే చింతా రామ్మూర్తి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి రాజమండ్రి యూనియన్ బ్యాంక్ ద్వారా లక్షల రూపాయలు రుణంగా తీసుకోవడం జరిగింది. బ్యాంకు అధికారులు లోన్ రికవరీ నిమిత్తం కలెక్టర్ అనుమతితో 2017లో స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి రాగా, అప్పటి ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ధర్మకర్తలు, ఈవో శర్మ, అర్చకులు, భక్తులు పెద్ద ఉద్యమాన్ని చేపట్టడానికి ముందుకు వచ్చారు. అప్పటి సీఐ విద్యాసాగర్‌రావు వాస్తవ పరిస్థితులను గమనించి భగవంతుని భూమి అన్యాక్రాంతమైతే భక్తుల్లో ఆవేశం పెరుగుతుందని, దీనివల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని బ్యాంకు వారికి తెలియజేసి వెనక్కి పంపించారు. నాటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి వాస్తవ పరిస్థితులను గమనించి భూమి దేవాలయానికి చెందినదని నిర్ధారణ చేసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయడం జరిగింది. ఈ స్థలాన్ని ఖాళీ చేయాలని దేవదాయశాఖ కోర్టులో ఓఏ ఉన్నప్పటికీ చింతా రామ్మూర్తి అనేక మార్గాల ద్వారా స్థలాన్ని ఖాళీ చేయకుండా కొనసాగుతున్నారు. ఈ స్థలంలోకి కొంతమంది ప్రవేశించి ఈ ఏడాది



దేవదాయశాఖ స్థలంలో నిర్మించిన షెడ్డు

సెప్టెంబరు 21వ తేదీన అక్రమంగా నిర్మాణాలు చేపట్టడాన్ని గమనించిన ప్రస్తుత ఈవో 24వ తేదీన ఆ స్థలంలోకి వెళ్లి నిర్మాణాలు నిలుపుదల చేయాలని సూచించారు. అదే రోజు ఈవో మురళీకృష్ణ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ రోజు రాత్రి పది గంటల నుంచి తెల్లవారే సరికి ఆక్రమణదారులు రేకులు సైతం బిగించేశారు. ఈ విషయాన్ని మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో మురళీకృష్ణ, అర్చకులు, పూర్వపు చైర్మన్లు, విశ్వహిందూపరిషత్ సభ్యులు, బ్రాహ్మణ సంఘాలతో సమావేశం నిర్వహించి ఆ స్థలంలోకి వెళ్లి అక్రమ నిర్మాణాలు అడ్డుకున్నారు. ఆక్రమణదారులు దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించగా ఈవో మురళీకృష్ణ, మాజీ చైర్మన్లు తిమ్మాపాత్రుని చక్రవర్తి, శ్రీరామదాసు గోవిందరావు, సకల గోవిందరావు, విశ్వహిందూ పరిషత్ నాయకులు బంకుపల్లి సత్తిబాబు, బీజేపీ నాయకుడు కొణతాల అప్పలరాజు ప్రతిఘటించారు. 26వ తేదీన ఈవో ఈ స్థలం దేవాలయానికి చెందినది అని బోర్డు ఏర్పాటు చేయగా, ఆ బోర్డును ఆక్రమణదారులు తొలగించారు. ఈ తరుణంలో విలువైన దేవుడు మాన్యాలు, పేద బ్రాహ్మణుల కోసం దానం చేసిన భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఈవో కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పంపిణీకి సాంకేతిక సమస్య



బెన్నవరంలో లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకుంటున్న డీలర్

చింతపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెన్నవరం డీఆర్ డిపోలో రేషన్ బియ్యం పంపిణీకి డీలర్లు సాంకేతిక సమస్యను ఎదుర్కొంటున్నారు. దీంతో బియ్యం లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయలేకపోతున్నారు. తాజాగా ప్రతి డీఆర్ డిపో పరిధిలో ఆన్‌లైన్‌లో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ఉన్నతాధికారలు ఆదేశాలు జారీచేశారు. అలాగే నూతన ఈపోస్ మిషన్‌లు పంపిణీ చేశారు. ఈనెల నుంచి ఆన్‌లైన్‌లో రేషన్ పంపిణీ జరుగుతున్నది. అయితే బెన్నవరం పంచాయతీ పరిధిలో సెల్ సంకేతాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. దీంతో సిగ్నల్స్ అందుబాటులో ఉన్న ప్రాంతానికి వెళ్లి లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకోవాల్సివస్తున్నది. కొన్ని సందర్భాల్లో సిగ్నల్ అందుబాటులోకి రాక పంపిణీ నిలిచిపోతున్నది. సెల్ సంకేతాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చే వరకు ఆఫ్‌లైన్ విధానంలో సరకులు పంపిణీ చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో సంగీత శిక్షణ

పాడేరురూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పూర్ణపుష్కలాంబ సమిత అయ్యప్పస్వామి ఆలయంలో సంగీత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్త, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు తెలిపారు. ఐదేళ్ల వయస్సు పైబడిన పిల్లలతో పాటు పెద్దలకు కర్ణాటక, లలిత, భక్తి, జానపద సంగీతం, ఫ్లూట్, కీబోర్డు, హార్మోనియం, గిటార్ వాయించడంపై శిక్షణ అందిస్తారన్నారు. ఆసక్తిగల చిన్నారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆలయానికి వచ్చి శిక్షణ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

హైడ్రో ప్రాజెక్టులకు గిరిజనులు భూములివ్వరు

▸▸ ఏపీ ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావుదొర

పాడేరురూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కోసం కొంతమంది హైడ్రో పవర్ ప్రాజెక్టులు కావాలంటున్నారని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అనడం తగదని ఏపీ ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావుదొర అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీల మనోస్థైర్యాన్ని దెబ్బతీసి, గిరి రైతుల పంట భూములను ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టేందుకు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఆదివాసీలకు జీవనాధారమైన భూములను ప్రైవేటు కంపెనీలకు ఇచ్చేందుకు సుముఖంగా లేరన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి 1/70, అటవీ హక్కుల చట్టంకు వ్యతిరేకంగా ఇచ్చిన అన్నిరకాల అనుమతులను శాశ్వతంగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్ కావెర్ల మన్మధరావు, జీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కిరసాని వరకిశోర్, నాయకులు బి.చంటి, ఎం.సురేష్ పాల్గొన్నారు.

'ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి'



గృహ యజమాని నుంచి వసూలు చేసిన నగదును కార్మికుడికి అందిస్తున్న యూనియన్ నాయకుడు రామారావు

పాడేరురూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు మోద ఉమానీలకంఠేశ్వర ప్రైవేటు ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు అన్నారు. స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడు సంఘంలో సభ్యత్వం పొందాలన్నారు. ఇటీవల ఒక గృహ యజమానికి కార్మికుడితో జరిగిన వివాదాన్ని పరిష్కరించామని, యజమాని నుంచి వసూలు చేసిన రూ. 25 వేలును కార్మికుడికి అందించారు. సమావేశంలో సంఘం నాయకులు ఎస్.దామోదర్, ఎం.స్వామినాయుడు, పి.బబ్లూ, బి.ప్రకాశరావు, ఎస్.వరప్రసాద్, శేఖర్ పట్నాయిక్, ఎ.నరేంద్ర, మధు, శివ, గిరి పాల్గొన్నారు.


ఘనంగా దుర్గాదేవి అనుపోత్సవం



ముంచంగిపుట్టులో దుర్గమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ముంచంగిపుట్టు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దుర్గాదేవి ఆలయం ప్రాంగణంలో మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి ప్రతిమ అనుపోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, ధింసా నృత్యాల నడుమ భారీ ఊరేగింపుగా గ్రామ నలుమూలలకు అమ్మవారి ప్రతిమనులు తీసుకువెళ్లారు. భక్తులకు ప్రసాదం అందించారు. అనంతరం మత్స్యగెడ్డలో దుర్గాదేవి ప్రతిమను నిమజ్జనం చేశారు. ఊరేగింపు సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎస్ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో పక్కా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉపాధిని నాశనం చేయొద్దు



మాడగడ వ్యూ పాయింట్ వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

అరకులోయ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్ ఎకో టూరిజం పేరిట ప్రాజెక్టులను కట్టి స్వయం ఉపాధి పొందుతున్న గిరిజనులు బతుకుల మీద కొట్టొదని ఆదివారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పెసా అధ్యక్షుడు బి.సుమన్, యూనియన్ నాయకుడు ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ మాడగడ వ్యూ పాయింట్ సర్వే 84లోని కొండబోరంబోకు భూమి అని, సుమారు 12 ఎకరాలు కలిగిన ఈ భూమికి సంబంధించి నలుగురు గిరిజన రైతులకు డి.పట్టాలు మంజూరు చేశారని చెప్పారు. వారంతా సాగు హక్కు కలిగి ఉన్నారన్నారు. అటవీ శాఖ అధికారులు తమ వ్యాపార సముదాయాలను తీసివేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పాడేరు డీఎఫ్‌వోను కలిసి వినతిపత్రం అందించామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలోని అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అందని ప్రభుత్వ వైద్యం

▸▸ సప్పర్ల పీహెచ్‌సీలో వైద్యుల పోస్టుల ఖాళీ

▸▸ ఇద్దరు డాక్టర్లకు ఒకేసారి బదిలీ

▸▸ కొత్తవారు రాక ముందే రిలీవ్ చేసిన జిల్లా వైద్యాధికారులు

▸▸ జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

గూడెంకొత్తవీధి/సీలేరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆదివాసీలకు సర్కారు వైద్యం అందని ద్రాక్షగా మారింది. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆదివాసీలు అవస్థలు పడుతున్నారు. రోగులకు స్టాఫ్‌నర్సులే వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో ఈ ఆస్పత్రికి వచ్చే మెజారిటీ రోగులను చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించాల్సిన దుస్థితి ఏర్పడింది.

గాలికొండ, అమ్మవారి ధారకొండ పంచాయతీల పరిధిలోని 35 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు సప్పర్ల పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. ఈ రెండు పంచాయతీల్లోని గిరిజనులకు రహదారి సదుపాయం లేదు. ఆదివాసీలు వైద్యం కోసం ఆస్పత్రికి కాలినడక వస్తుంటారు. రెండు నెలల క్రితం వైద్యుల బదిలీలు జరిగాయి. స్థానిక పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ ప్రసన్నకుమార్‌ని నాతవరం, డాక్టర్ సందీప్‌ని అనకాపల్లి బదిలీ చేశారు. వైద్యులకు బదిలీ అయినప్పటికి కొత్తవారు వచ్చే వరకు రిలీవ్ చేయరాదని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ వీరిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రిలీవ్ చేశారు. దీంతో రెండు వైద్యాధికారుల పోస్టులు ప్రస్తుతం ఖాళీగా వున్నాయి. సప్పర్ల పీహెచ్‌సీకి ప్రత్యామ్నాయంగా వైద్యులను నియమించలేదు. దీంతో ప్రాంతీయ ఆదివాసీలకు వైద్యసేవలు దూరమయ్యాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలందించేందుకు అదనపు వైద్యాధికారులు ఉన్నారు. ఈవైద్యులను కేవలం కార్యాలయానికి మాత్రమే పరిమితం చేశారు తప్ప వైద్యుల పోస్టులు ఖాళీగానున్న సప్పర్ల పీహెచ్‌సీకి నియమించలేదు.



సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు



ఖాళీగానున్న వైద్యుల కుర్చీలు

అవస్థలు పడుతున్న ఆదివాసీలు

పీహెచ్‌సీ పరిధిలో వైద్యులు లేకపోవడంతో చిన్నపాటి అనారోగ్య సమస్యకు సైతం 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతపల్లి ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. రోగాలతో ఆస్పత్రికి వచ్చిన రోగులకు స్టాఫ్‌నర్సులు సాధారణ చికిత్స అందిస్తున్నారు. వైద్యాధికారి పరీక్షించాల్సి వస్తే సిబ్బంది చింతపల్లి ఏరియా ఆస్పత్రికి పంపిస్తున్నారు. దీంతో ఆదివాసీ రోగులకు ప్రయాణ భారం పెరిగిపోతోంది.

వైద్యుల పోస్టులను భర్తీ చేయాలి



కిల్లో భీమన్న, కూటమి నాయకుడు, సప్పర్ల

సప్పర్ల పీహెచ్‌సీలో మూడు నెలలుగా వైద్యులు అందుబాటులోలేరు. రోగులు మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తున్నది. వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలని పలుమార్లు ఉన్నతాధికారులకు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదు. జిల్లా కలెక్టర్ స్పందించి ఖాళీగానున్న వైద్యుల పోస్టులను భర్తీచేసి ఆదివాసీలకు మెరుగైన వైద్యం అందించాలి.

రెండు గ్రామాల మధ్య భూవివాదం

సీలేరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):గూడెంకొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని తోకరాయి, చోడిరాయి గ్రామస్థుల మధ్య భూవివారం చోటు చేసుకుంది. ఆదివారం రెండు గ్రామాల ప్రజలు ఒకరిపై ఒకరు దాడి చేసుకునేందుకు యత్నించగా.. సీలేరు ఎస్ఐ రవీంద్ర సంఘటన స్థలానికి వెళ్లి ఆదివాసీలకు కౌన్సెలింగ్ చేశారు. చోడిరాయి గ్రామస్థులు సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో నాటుకున్న మొక్కలను తోకరాయి గిరిజనులు నరికివేశారు. దీంతో ఇరు గ్రామాల ప్రజల మధ్య గొడవలు మొదలయ్యాయి. రెండు గ్రామాల ప్రజలు దాడికి ప్రత్నించడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఇరు గ్రామాల ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి గొడవలు పడరాదని, రెవెన్యూ అధికారుల సహకారంతో భూవివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించారు.



రెండు గ్రామాల గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర

ఆర్‌వీనగర్-పాలగెడ్డ రహదారిని బాగు చేయండి

▸▸ ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యుడు డిమాండ్

చింతపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్‌వీనగర్-పాలగెడ్డ అంతర్ రాష్ట్ర రహదారి అత్యంత అధ్వానంగా తయారైందని, ప్రభుత్వం స్పందించి నిర్మాణాలు చేపట్టాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. ఆదివారం జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ రహదారి మీదుగా భద్రాచలం, సీలేరు, హైదరాబాద్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంత ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారన్నారు. రహదారి పూర్తిగా పాడైపోవడంతో ప్రయాణికుల అవస్థలు పడుతున్నారన్నారు. లోతుగెడ్డ-రాళ్లగెడ్డ, ఆర్‌వీనగర్-పాలగెడ్డ రహదారులు శిధిలమైపోవడంతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. రోగులు, గర్భిణులను తరలించడం కష్టంగా ఉందన్నారు. ఈ రహదారుల దుస్థితిపై పలుమార్లు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోతో పాటు పాలకులకు వినతిపత్రాలు అందజేసినప్పటికి కనీస స్పందన లేదన్నారు. ఇప్పటికైన ఆర్‌వీనగర్-పాలగెడ్డ, లోతుగెడ్డ-పాలగెడ్డ రహదారుల నిర్మాణాలకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే గిరిజనులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీలు కుమారి, అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

విత్తన బంతులతో ఆహ్లాదకర వాతావరణం

▸▸ జిల్లా అటవీ శాఖాధికారి సోమసుందర్



విత్తన బంతులు విసిరే కార్యక్రమంలో డీఎఫ్‌వో, గ్రీన్‌క్లబ్ ప్రతినిధులు

కొత్తూరు, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనం పెంచేందుకు విత్తన బంతులు ఎంతగానో దోహదపడతాయని జిల్లా అటవీ శాఖాధికారి ఎం.సోమసుందర్ అన్నారు. ఇక్కడి సత్యనారాయణపురం కళ్యాణ గిరిపై ఆదివారం గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు వేలకుపైగా విత్తనబంతులు విసిరే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. విత్తన బంతులతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ఇందుకోసం మొక్కలు నాటాలని సూచించారు. సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ అప్పికొండ గణేశ్ మాట్లాడుతూ గ్రీన్ క్లబ్ గత పదకొండు సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిని అభినందించారు.

అనంతరం విత్తన బంతులను కొండపై నుంచి విసిరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు అసిస్టెంట్ డ్రగ్స్ కంట్రోలర్ కాండ్రేగుల సూర్య సత్యనారాయణ, రిటైర్డు అటవీ శాఖాధికారి బీరా వినోద్‌కుమార్, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, గ్రీన్ క్లబ్ ప్రతినిధి కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ఉపాలయాల భూమి ఆక్రమణ

▸▸ కబ్జాదారులపై పోలీసులకు దేవదాయ శాఖ ఫిర్యాదు ▸▸ ఆలస్యంగా వెలుగు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేముని గుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గల ఉపాలయాల స్థలం ఆక్రమణలపై ఆలయ ఈవో మురళీకృష్ణ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ అంశానికి సంబంధించిన వివరాలివి. శ్రీవారి ఆలయంలోని ఉపాలయాలైన సత్యనారాయణస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాల ధూప దీప నైవే ద్యం, అర్చకుల భృతి నిమిత్తం చింతావారి డిపోగా పిలవబడే 60 సెంట్ల భూమిని వేదుల ఫైనులు దేవాలయానికి గతంలో దానం చేశారు. సదరు భూమిని అప్పటి అర్చకులు వంగ తోట వేసుకొని పండించి బతుకుతూ స్వామివారికి ధూప, దీప నైవేద్యాలు చేసేవారని ఆలయ అధికారులు చెబుతున్నారు. కాలక్రమంలో చింతా రామ్మూర్తి సుమారు ముప్పై మూడున్నర సెంట్ల భూమిని లీజుకు తీసుకున్నారని తెలిలిసింది. మిగిలిన స్థలంలో ఇద్దరు వ్యక్తులు అద్దె చెల్లిస్తున్నారు. అయితే చింతా రామ్మూర్తి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి రాజమండ్రి యూనియన్ బ్యాంక్ ద్వారా లక్షల రూపాయలు రుణంగా తీసుకోవడం జరిగింది. బ్యాంకు అధికారులు లోన్ రికవరీ నిమిత్తం కలెక్టర్ అనుమతితో 2017లో స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి రాగా, అప్పటి ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ధర్మకర్తలు, ఈవో శర్మ, అర్చకులు, భక్తులు పెద్ద ఉద్యమాన్ని చేపట్టడానికి ముందుకు వచ్చారు. అప్పటి సీఐ విద్యాసాగర్‌రావు వాస్తవ పరిస్థితులను గమనించి భగవంతుని భూమి అన్యాక్రాంతమైతే భక్తుల్లో ఆవేశం పెరుగుతుందని, దీనివల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని బ్యాంకు వారికి తెలియజేసి వెనక్కి పంపించారు. నాటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి వాస్తవ పరిస్థితులను గమనించి భూమి దేవాలయానికి చెందినదని నిర్ధారణ చేసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయడం జరిగింది.

ఈ స్థలాన్ని ఖాళీ చేయాలని దేవదాయశాఖ కోర్టులో ఓఏ ఉన్నప్పటికీ చింతా రామ్మూర్తి అనేక మార్గాల ద్వారా స్థలాన్ని ఖాళీ చేయకుండా కొనసాగుతున్నారు. ఈ స్థలంలోకి కొంతమంది ప్రవేశించి ఈ ఏడాది సెప్టెంబరు 21వ తేదీన అక్రమంగా నిర్మాణాలు చేపట్టడాన్ని గమనించిన ప్రస్తుత ఈవో 24వ తేదీన ఆ స్థలంలోకి వెళ్లి నిర్మాణాలు నిలుపుదల చేయాలని సూచించారు. అదే రోజు ఈవో మురళీకృష్ణ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ రోజు రాత్రి పది గంటల నుంచి తెల్లవారే సరికి ఆక్రమణదారులు రేకులు సైతం బిగించే శారు. ఈ విషయాన్ని మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో మురళీకృష్ణ, అర్చకులు, పూర్వపు చైర్మన్లు, విశ్వహిందూపరిషత్ సభ్యులు, బ్రాహ్మణ సంఘాలతో సమావే శం నిర్వహించి ఆ స్థలంలోకి వెళ్లి అక్రమ నిర్మాణాలు అడ్డుకున్నారు. ఆక్రమణదారులు దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించగా ఈవో మురళీకృష్ణ, మాజీ చైర్మన్లు తిమ్మాపాత్రుని చక్రవర్తి, శ్రీరామదాసు గోవిందరావు, సకల గోవిందరావు, విశ్వహిందూ పరిషత్ నాయకులు బంకుపల్లి సత్తిబాబు, బీజేపీ నాయకుడు కొణతాల అప్పలరాజు ప్రతిఘటించారు. 26వ తేదీన ఈవో ఈ స్థలం దేవాలయానికి చెందినది అని బోర్డు ఏర్పాటు చేయగా, ఆ బోర్డును ఆక్రమణదారులు తొలగించారు. ఈ తరుణంలో విలువైన దేవుడు మాన్యాలు, పేద బ్రాహ్మణుల కోసం దానం చేసిన భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఈవో కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దేవదాయశాఖ స్థలంలో నిర్మించిన షెడ్డు

సందిగ్ధంలో సాగుదారులు

... 3వ పేజీ తరువాయి

తోటల్లో నిర్వహణ, సస్యరక్షణ పనులు చేపట్టి, ఎరువులు వేయాల్సిన సమయం వచ్చింది. పరిశ్రమల కోసం భూములను ఎప్పుడు తీసుకుంటారో అధికారులు చెప్పకపోవడంతో తోటల్లో ఆయా పనులు చేయాలా? వద్దా? అన్న సందిగ్ధంలో రైతులు వున్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే గ్రామసభ ఏర్పాటుచేసి, భూములు ఎప్పుడు తీసుకుంటారు? పరిహారం ఎంత ఇస్తారు? అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని ఆయా సాగుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పక్కాగా ఆస్తి పన్ను వసూళ్లు

... 3వ పేజీ తరువాయి

పన్ను మదింపు చేస్తున్నారు. అలాగే వారసత్వంగా వచ్చిన స్థలం ఉండి, దస్తావేజులు లేక ప్లాన్ అనుమతులు తీసుకోకుండా నిర్మించిన ఇళ్లను, అదే విధంగా ప్లాన్ అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్ల గుర్తిస్తున్నారు. కాగా మునిసిపాలిటీలో ఆస్తి పన్ను డిమాండ్ రూ.5.9 కోట్లు ఉంది. సర్వేలో గుర్తించిన కొత్త ఇళ్లు, అదనపు నిర్మాణాలను కలుపుకుంటే ఈ ఆదాయం మరికొంత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

బాబోయ్ కుక్కలు!

... 3వ పేజీ తరువాయి

కుక్కల గుంపు దాడి చేసి గాయపరిచాయి. ఇలా పలు గ్రామాల్లో కుక్కల స్వైర విహారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కకాటు బాధితుల్లో పలువురు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి, విశాఖపట్నం కేజీహెచ్‌కి, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకున్నారు. కాగా మండలంలో కొంతకాలం నుంచి కుక్కకాటు కేసులు పెరుగుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ చక్రవర్తి చెబుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

భాషా పండిట్లకు పదోన్నతులు

... 3వ పేజీ తరువాయి

వై.దయానంద్ ధన్యవాదాలు తెలిపారు.

అంతర్ జిల్లా బదిలీ టీచర్లకు పోస్టింగ్స్

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాకు బదిలీపై వచ్చిన 48 మంది ఉపాధ్యాయులకు విద్యా శాఖ పోస్టింగ్స్ ఇచ్చింది. వీరిలో 16 మంది స్కూల్ అసిస్టెంట్, 32 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. ఎక్కువమందికి కేటగిరీ 3, 4 పరిధిలోని పాఠశాలల్లో పోస్టింగ్స్ దక్కాయి. దీనిపై కొందరు టీచర్లు అభ్యంతరం వ్యక్తంచేసి ఆందోళనకు దిగినా.. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఏజెన్సీ, మారుమూల ప్రాంత పాఠశాలల్లో నియమించారు.

ఎలమంచిలిలో భారీ వర్షం

... 3వ పేజీ తరువాయి

అనూహ్యంగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై భారీ వర్షం పడింది. పిడుగులు పడుతుండడంతోపాటు గాలి కూడా వీస్తుండడంతో ముందు జాగ్రత్త చర్యగా ఈపీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కాగా భారీ వర్షం కారణంగా పట్టణంలో వీధి రోడ్లతోపాటు ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు, ఎంపీడీఓ కార్యాలయం రోడ్డు, క్లబ్ రోడ్డు, కొత్తపేట రోడ్డు, తదితర చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోయింది. డ్రైనేజీలు పొంగడంతో రహదారులపై బురద, చెత్తాచెదారం పేరుకుపోయాయి. కాగా ఎగువున్న వున్న పెదపల్లి ప్రాంతంలో కురిసిన వర్షంతో శేషుగెడ్డకు భారీగా వరద వచ్చింది. రాత్రి 9.30 గంటల సమయంలో గెడ్డ పొంగి, పాత జాతీయ రహదారి మీదుగా నీరు ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

త్రుటిలో తప్పిన ప్రమాదం

... 3వ పేజీ తరువాయి

పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. ఎట్టకేలకు వారం రోజుల క్రితం వరద ఉధృతి నెమ్మదించడంతో కాజ్‌వే పనులు మొదలుపెట్టారు. తొలుత సిమెంట్ పైపులు అమర్చి, వాటిపై గ్రావెల్ వేసి చదును చేశారు. రెండు రోజుల నుంచి ద్విచక్ర వాహనాలను, పాదచారులను రాకపోకలకు అనుమతించారు. సిమెంట్, మెటల్ మిక్సర్ వేసి, రోలింగ్ చేసిన తరువాత ఇతర వాహనాలను అనుమతిస్తామని అధికారులు చెప్పారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి సిమెంట్, మెటల్ మిక్సర్ తెచ్చి కుప్పలు పోశారు. ఆదివారం ఈ కుప్పలను సరిచేసి రోలింగ్ చేయాల్సి వుంది. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్.. కాజ్‌వే మీదుగా ద్విచక్ర వాహనాలు కాకుండా మిగిలిన వాహనాలు వెళ్లకుండా ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆదివారం ఉదయం చోడవరం వైపు నుంచి వడ్డాది వైపు వస్తున్న టాటా ఏస్ గూడ్స్ వాహనం కాజ్‌వే మీదుగా వెళ్లడానికి డ్రైవర్ ప్రయత్నించాడు. సగభాగంలో సిమెంట్ మిక్సర్ వుండడంతో, మిగిలిన సగభాగంలో నుంచి వెళ్లే క్రమంలో మిక్సర్ కుప్పపైకి ఎక్కి నది ప్రవాహం వైపునకు ఒరిగిపోయింది. అయితే అదృష్టవశాత్తూ నీటిలో పడకపోవడంతో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం గురించి తెలుసుకున్న కాజ్‌వే కాంట్రాక్టర్.. వెంటనే కూలీలను రప్పించి సిమెంట్ మిక్సర్ కుప్పలను కాజ్‌వేపై పరిచి రోలింగ్ చేయించారు. ఆదివారం సాయంత్రానికి పనులు పూర్తికావడంతో అన్ని రకాల వాహనాల రాకపోకలకు అనుమతిచ్చారు. కాగా కాజ్‌వేకు ఇరుపక్కలా రక్షణ కోసం చిన్నపాటి కర్రలు పాతారు. రాత్రిపూట ఈ కర్రలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం వుంది. రేడియం స్టిక్కర్లతో ఇనుప రెయింగ్ బిగించి, లైట్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

జీఎస్టీ సంస్కరణల ఫలితం సామాన్యులకు దక్కాలి

▸▸ వ్యాపార సంస్థల వద్ద పాత, కొత్త ధరల బోర్డులు ఏర్పాటు చేయాలి

▸▸ కన్సూమర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు 'కాండ్రేగుల'



అనకాపల్లి టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీలో సంస్కరణల నేపథ్యంలో వ్యాపార సంస్థల వద్ద వస్తువుల పాత, కొత్త ధరల బోర్డులను ఏర్పాటు చేయాలని కన్సూమర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ కోరారు. దీనివల్ల వస్తువు ధర ఎంత మేర తగ్గిందనేది కొనుగోలుదారులకు తెలుస్తుందన్నారు. ఇక్కడి పబ్లిక్ ఫోరం కార్యాలయంలో ఆదివారం 'జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు- వినియోగదారుల హక్కులు' అంశంపై విని యోగదారుల సంఘాల ప్రతినిధులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపు ధరలు క్షేత్రస్థాయిలో వినియోగదారులకు తెలియడం లేదన్నారు. ధరలను అదుపు చేయాల్సిన అధికార యంత్రాంగం మొక్కుబడిగా అవగాహన సదస్సులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే జీఎస్టీ ఎంత తగ్గుతుందో తెలుస్తుందన్నారు. ఏసీలు, టీవీలు, వివిధ ఎలక్ట్రికల్ పరికరాలు, వాహనాలు వంటి పెద్ద పెద్ద వస్తువులకు జరుగుతున్న తగ్గింపు ధరల ప్రచారం నిత్యం సామాన్యులు వినియోగించే వస్తువులకు జరగకపోవడం విచారకరమన్నారు. ఈ సమావేశంలో వినియోగదారుల సంఘాల ప్రతినిధులు రెడ్డి సత్యనారాయణ, ఎస్. నూకరాజు, సుందరపు సంజీవరావు, బొడ్డేడ జగ్గఅప్పారావు, పైలా రవి తదితరులు పాల్గొన్నారు.

తుప్పలతో తిప్పలు

రహదారులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు

- రోడ్లను ఆక్రమించేంతగా పెరిగిపోయిన వైనం
- ప్రమాదకరంగా మారుతున్న మార్గాలు
- జంగిల్ క్లియరెన్స్ చేయని అధికారులు
- భయాందోళనలో వాహన చోదకులు

అసలే మలుపులు.. ఆపై తుప్పలు.. ఎక్కడున్నాయో తెలియని హెచ్చరిక బోర్డులు.. దరి చేరితేగాని కానరాని వాహనాలు.. వెరసి బిక్కుబిక్కుమంటూ రాకపోకలు.. ఇదీ చోడవరం, మాడుగుల, చీడికాడ మండలాల్లోని పలు రహదారుల్లో దుస్థితి. రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడం.. సంబంధిత అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.


మాడుగుల నుంచి ఇండివరం వెళ్లే రోడ్డుకిరువైపులా దట్టంగా కమ్మేసిన తుప్పలు

మాడుగుల/మాడుగుల రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నుంచి ఖండివరం వెళ్లే మార్గంలో ఇరువైపులా తుప్పలు, పిచ్చి మొక్కలు దట్టంగా కమ్మేస్తున్నాయి. అలాగే అగ్నిమాపక కేంద్రం సమీపం నుంచి దబ్బగుంట రోడ్డు, కస్పాజగన్నాథపురం, కేజే పురం నుంచి అప్పలరాజుపురం, వడ్డాది నుంచి వీరవిల్లి అగ్రహారం, వీరనారాయణం వెళ్లే మార్గాల్లో ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. దీనికితోడు ప్రమాదకర మలుపులు ఉండడం వల్ల దగ్గరికి చేరుకునే వరకు రోడ్డు సరిగా కనిపించక వాహనచోదకులు భయపడుతున్నారు. చీడికాడ మండలానికి చెందిన ఖండివరం గ్రామస్థులు మాడుగులకు పలు పనులు నిమిత్తం ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. మాడుగుల ఆస్పత్రికి, నిత్యావసర సరకులు కొనుక్కునేందుకు, బ్యాంకు పనుల కోసం ద్విచక్ర వాహనాలు, ఆటోలపై వచ్చిపోతున్నారు. ఈ మార్గంలో మాడుగులకు గవరవీధికి చెందిన రైతుల పంట కల్లాలు ఉన్నాయి. దీంతో ఆయా రైతులు ఉదయం, సాయంత్రం వేళల్లో పంట పొలాలకు వెళుతుంటారు. ఈ క్రమంలో ఇరువైపులా తుప్పలు పెరిగిపోయి రోడ్డును కమ్మేయడంతో వాహన చోదకులు, రైతులు ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి భీతిల్లుతున్నారు. ప్రమాదకర మలుపులు వద్ద ఎదురెదురు వాహనాలను గమనించి తప్పించుకుని వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో పలువురు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. ఈ రోడ్డును ఆనుకుని ఉన్న తుప్పలు, పిచ్చి మొక్కలు తొలగించేందుకు సంబంధిత అధికారులు తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని వాహన చోదకులు, ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు.


ఖండివరం రహదారి కనిపించనంతగా ఇరువైపులా ఏపుగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

ప్రమాదకరంగా చోడవరం-దేవరాపల్లి రహదారి



చోడవరం-దేవరాపల్లి మార్గంలో రేవళ్లు సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు

చోడవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం మీదుగా దేవరాపల్లి వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. అన్నవరం నుంచి లక్కవరం వరకూ రోడ్డు పూర్తిగా మలుపులతో ఉంటుంది. అసలే సింగిల్ లేన్ రోడ్డు కావడం, రోడ్డుకు ఇరువైపులా తుప్పలు విపరీతంగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. చాలా నెలలుగా రోడ్డు పక్కన తుప్పలు తొలగించకపోవడంతో పాటు ప్రస్తుతం పెరిగిపోయిన తుప్పలతో రోడ్డు ఇరుకుగా మారిపోయింది. ఒక పక్క వాహనాలు కనిపించకపోవడం, మరో వంక వాహనాలు స్వేచ్ఛగా పక్కకు తప్పుకునే అవకాశం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే చోడవరం నుంచి దేవరాపల్లి రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ చేపట్టి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

చీడికాడ-మంచాల-కోనాం రహదారుల్లో...

చీడికాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడికాడ నుంచి మంచాల మోడల్ స్కూల్ వరకు రహదారిలో ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. అలాగే మంచాల నుంచి కోనాం వరకూ ఉన్న రహదారుల్లో ఇరువైపులా తుప్పలు మొలచాయి. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణిస్తున్న వాహనదారులు ప్రతి రోజూ తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే వర్షాలు అధికంగా కురవడంతో పాటు గాలులు వీస్తుండడంతో తుప్పలు రోడ్లపై వాలిపోతుండటంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.


చీడికాడ-మంచాల రోడ్డు మలుపులో పెరిగిన తుప్పలు


మంచాల-కోనాం రోడ్డును కప్పివేసిన తుప్పలు

చీడికాడ నుంచి మంచాల, గుంటుకొత్తూరుమీదుగా కోనాం పంచాయతీతో పాటు పాడేరు మండలం ఏజెన్సీ గ్రామాలకు ప్రతి రోజూ ఇదే రహదారిపై పలు వాహనాలు తిరుగుతున్నాయి. అసలే మలుపులు ఎక్కువగా ఉండడానికి తోడు దగ్గరకు వచ్చేవరకూ వాహనాలు కనిపించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి ఈ పిచ్చి తుప్పలను తొలగించాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

ఐదుగురు యువకులకు తీవ్ర గాయాలు

రావికమతం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.పొన్నవోలు సమీపంలో బీఎన్ రోడ్డుపై ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఐదుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రోలుగుంట మండలం కోమరవోలుకు చెందిన బండారు మనోవరహా వినయ్, బండారు బాల తేజ, వంటాకుల మదన్‌కుమార్ శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై రావికమతం నుంచి కోమరవోలు స్వగ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో టి.అర్జాపురం గ్రామానికి చెందిన రాజాన జనార్దన్, తన పెదనాన్న కుమారుడైన మత్స్యవానిపాలేనికి చెందిన ఆడాడ సాయితో బైకుపై మేడివాడ వైపు వెళ్తున్నారు. పి.పొన్నవోలు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. స్థానికులు, కుటుంబ సభ్యులు క్షతగాత్రులను విశాఖ ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించారు. మత్స్యవానిపాలేనికి చెందిన యువకుడు ఆడాడ సాయి, నర్సీపట్నం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

చోడవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

చోడవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఐదు గంటల నుంచి ఉరుములు, మెరుపులతో గంట పాటు వర్షం పడింది. పిడుగులు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి బాలాజీనగర్, చీడికాడ రోడ్డు, పూర్ణా థియేటర్ పరిసరాలను వాన నీరు ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



చీడికాడ రోడ్డులో భారీ వర్షానికి రహదారిపై పారుతున్న వాన నీరు... నీట మునిగిన పూర్ణా థియేటర్ ఆవరణ

మాడుగులలో...

మాడుగుల/మాడుగుల రూరల్: మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం పొడిగానే ఉంది. సాయంత్రం నుంచి మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. భారీగా వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. పలు చోట్ల రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు చేరి చెరువులను తలపించాయి.

గొలుగొండ మండలంలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం, చోద్యం, నాగాపురం, పాతకృష్ణాదేవిపేట గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి భారీ వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏఎల్‌పురం బీసీ కాలనీలో పల్లి అప్పలనాయుడు ఇంటిలోకి వర్షం నీరు చేరింది. ఈ సమస్యపై టీడీపీ నేత బొడ్డు జమీలు స్పందించి మోటారు సాయంతో ఇళ్లల్లో చేరిన వర్షం నీటిని తొలగించారు. ఏ విధి చూసినా డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో వర్షం నీరు ఎటూ పోలేని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


ఏఎల్ పురం బీసీ కాలనీలో ఏరులై పారుతున్న వాన నీరు

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు, అయ్యప్ప, భవానీ మాలధారులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు మోదకొండమ్మ ఘటాల పండుగను నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బుచ్చెయ్యపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని తహశీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవుతారని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అలాగే అర్జీలను వెబ్‌సైట్‌లో నమోదు చేస్తామని, ఫిర్యాదుదారులు తమ అర్జీల వివరాలను వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు.

బెల్టు దుకాణాలపై దశలవారీ ఉద్యమం

దేవరాపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టు దుకాణాలపై దశల వారీగా ఉద్యమం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న తెలిపారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం మండల కార్యదర్శి బీటీ.దొర అధ్యక్షతన ఆదివారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. వీటిలో అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బెల్టు దుకాణాలను నియంత్రించాలని విన్నవించారు. లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

అల్లూరికి సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల నివాళులు


అల్లూరి, గంటందొర సమాధులు వద్ద క్రీడాకారుల జోహార్లు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు సమాధులను సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు ఆదివారం సందర్శించారు. సాఫ్ట్‌బాల్ సంఘం నాయకులు, కోచ్‌లు, విద్యార్థులు అధిక సంఖ్యలో వెళ్లి అల్లూరికి, గంటందొర సమాధులకు నివాళులు అర్పించారు. అలాగే పార్కులో అందాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తారకేశ్వరరావు పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్ మనుగడకు సహకరించండి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు జనసేన నేతల వినతి

చోడవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రధానమైన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మనుగడతో పాటు బీఎన్ రోడ్డు అభివృద్ధి పనులకు సహకారం అందించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నియోజకవర్గ పార్టీ ముఖ్య నేతలతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్‌కు ఆదివారం విశాఖలోని స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వేల మంది రైతులు, కార్మికులకు ఆధారంగా ఉన్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ లేదా అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం నుంచి నిధులు వచ్చేలా చొరవ చూపించాలని కోరారు. గోవాడకు ఎన్‌సీడీసీ నుంచి రుణ సహకారం అందించేలా చూసి ఫ్యాక్టరీని నిలబెట్టాలన్నారు. అలాగే బీఎన్ రోడ్డు ధ్వంసం కావడంతో ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ఎవరూ ముందుకు రావడం లేదని, తద్వారా ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఎన్ రోడ్డు అభివృద్ధితో పాటు నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాధవ్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రామప్పారావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ బలిజ మహరాజ్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ముఖ్య నాయకులు దాడి సూరి నాగేశ్వరరావు, మైచర్ల నాయుడు, బంటు రామానాయుడు, తుమ్మపాల రమేశ్, చప్పగడ్డ శ్రీను, శివశంకర్, సత్తిబాబు పాల్గొన్నారు.


మాధవ్‌తో సమావేశమైన జనసేన ఇన్‌చార్జి రాజు, నాయకులు

నిండుకుండలా కోనాం జలాశయం


కళకళలాడుతున్న కోనాం జలాశయం

చీడికాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం జలాశయం నిండుకుండలా కళకళలాడుతోంది. తుఫాన్ వర్షాలకు వరదనీరు వస్తుండగా, కొంత నీటిని ప్రతి రోజూ అధికారులు విడుదల చేస్తున్నారు. అయినప్పటికీ ఆదివారం ఉదయం నాటికి జలాశయం నిండుకుండలా కనిపిస్తున్నది. జలాశయం గరిష్ఠ స్థాయి నీటి మట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99.5 మీటర్లకు చేరుకుంది. జలాశయం ఎగువ ప్రాంతాల నుంచి 390 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా, 130 క్యూసెక్కుల నీటిని ఎగువ, దిగువ కాలువల ద్వారా విడుదల చేస్తున్నామని ఏఈ సత్యనారాయణదొర విలేకరులకు తెలిపారు.

చెత్త తొలగించాలని నిరసన


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్సీ కాలనీ వాసులు

రావికమతం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చెత్తను తక్షణ తొలగించే చర్యలు చేపట్టాలని మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అంబేడ్కర్ విగ్రహం, చెత్త కుప్పల వద్ద చేతులు జోడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కె.గోవిందరావు మాట్లాడుతూ గ్రామంలో ఊడ్చిన చెత్తంతా ఎస్సీ కాలనీని ఆనుకుని డంప్ చేస్తున్నారని, వర్షాలకు కుళ్లిపోయి తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోయారు. ఈ సమస్యపై జిల్లా కలక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ ప్రతినిధులు సిహెచ్.సూరిబాబు, సిహెచ్.రాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హ్యాపీ సండే

ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నృత్యాలతో ఆలరించిన చిన్నారులు




నృత్య ప్రదర్శన ఇస్తున్న పిల్లలు.. (ఇన్‌సెట్‌లో) కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్ సురేంద్ర

నర్సీపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. వాకర్స్ క్లబ్ సహకరంతో కమిషనర్ సురేంద్ర ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నింజాస్ అకాడమీ పిల్లలు బాక్సింగ్, కరాటే, క్యాట్ వాక్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. సినిమా పాటలకు నృత్యాలు చేసి ఆలరించారు. ఈ సందర్భంగా కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ ఉద్యోగులు, వ్యాపారులు పని ఒత్తిడితో ఉంటారని, వారి కోసం హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమం పాల్గొని మానసిక ఒత్తిడి నుంచి బయటపడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు కామిరెడ్డి సత్యనారాయణ, అల్లు అప్పారావు, అడిగర్ల వరహాలనాయుడు, ఎంఎస్ ప్రసాద్, మంతిన గోపి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.గజ్జాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్‌కు డీపీఎన్ పాఠశాల విద్యార్థి ఎంపిక


కేశవ

కశింకోట, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఇక్కడి డీపీఎన్ పాఠశాల విద్యార్థి బి.కేశవ ఎంపికయ్యాడు. విశాఖ లోని గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి జట్టు ఎంపికలో కేశవ అద్భుత ప్రతిభ చూపి అర్హత సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు ఎన్‌జేవీ ప్రసాద్ తెలిపారు.

63 మందికి నేత్ర పరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

చీడికాడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 63 మందికి వైద్య నిపుణులు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 31 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి శంకర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా వైద్యం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో అక్షరశ్రీ విద్యాలయం కరస్పాండెంట్ బొబ్బిలి మధు, డాక్టర్ అరుణ, శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ అనుపమ, స్టాఫ్ నర్సు రేణుక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భావితరాలను శక్తివంతంగా తయారు చేయాలి

ఉపాధ్యాయ శిక్షణలో డీఈవో అప్పారావునాయుడు

సబ్బవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : యోగాపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకుని తద్వారా భావితరాలను శక్తివంతంగా తయారు చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న డీఎస్సీ-2025 ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని ఆదివారం సందర్శించి మాట్లాడారు. ఈ నెల పదో తేదీ వరకు శిక్షణ శిబిరాలు కొనసాగుతాయన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని, అందులో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డీఆర్‌పీలు, ఎంఈవోలు, ట్రైనర్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు. అంతకు ముందు అంతా కలిసి యోగా, ధ్యానం చేశారు.